క్లుప్తంగా

21 నుంచి ఓటర్ల జాబితా పారదర్శకతకు సర్వే



మాట్లాడుతున్న డీటీ రమేష్

కె.కోటపాడు: ఓటర్ల జాబితాలో పారదర్శకతకు ఈ నెల 21 నుంచి వచ్చే నెల 21వ తేదీ వరకూ బీఎల్వోలు ఇంటింటా సర్వే చేయనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ డి.రమేష్ తెలిపారు. ఈ సర్వేపై స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం రాజకీయ పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేలో భాగంగా 18 ఏళ్లు నిండిన వారికి ఓటుహక్కు నమోదుతోపాటు, మృతులు, శాశ్వతంగా వలసదారులు, డబుల్ ఎంట్రీ ఓట్లను తొలగించాలన్నారు. తప్పొప్పులను సవరించాలన్నారు. సమావేశంలో ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ జె.త్రిమూర్తులు పాల్గొన్నారు.

89 మంది విద్యార్థినులకు కళ్లద్దాల పంపిణీ



వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా కళ్లద్దాలు పొందిన బాలికలు

చోడవరం రూరల్: డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో 89 మంది విద్యార్థినులకు కళ్లద్దాలను పంపిణీ చేశారు. తొలుత 659 మంది విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో దృష్టి లోపం ఉన్నవారికి వీటిని అందజేశామని ప్రధానోపాధ్యాయుడు రామిరెడ్డి తెలిపారు. వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా తమ దృష్టి లోపాలను సరిచేసినందుకు విద్యార్థినులు ఈ సందర్భంగా సీఎం జగన్మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చోడవరం ప్రాంతీయ ఆరోగ్య కేంద్రం ఆఫ్తాలమిక్ అడ్వైజర్ శ్రీనివాస్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

మాడుగుల ఎంఈవో -1గా పాండురంగారావు




పాండురంగారావును సన్మానిస్తున్న యూటీఎఫ్ నాయకులు

మాడుగుల రూరల్: ఎంఈవో-1గా కె. పాండురంగారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చోడవరం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఈయన పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పోలిమేర చంద్రరావు, తదితర్లు స్థానిక ఎమ్మార్సీలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు శరగడం జగ్గారావు, ఎస్. కొండలరావు, కె. సత్తిబాబు, ఎ. అప్పారావు, శివ, రామారావు, మురళీ, ఆనంద్, సింహాచలం పాల్గొన్నారు.

భూ ఆక్రమణపై ఫిర్యాదు

మాకవరపాలెం: గ్రామ కంఠం భూమి ఆక్రమణ తొలగించాలని స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు చినరాచపల్లి గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని సర్వే నంబర్ 656లో 2.40 ఎకరాల భూమి ఉంది. ఇందులో ఆరు సెంట్ల భూమిని తప్పుడు రికార్డులు సృష్టించి ఆక్రమించారని ఫిర్యాదు చేసినట్టు రామన్నపాలెం మాజీ ఎంపీటీసీ సభ్యుడు సుర్ల లక్ష్మీనాయుడు, చింతల అప్పలనాయుడు, రాంబాబు సోమవారం తెలిపారు.

గోతిలో పడి పశువు మృతి



మృతి చెందిన పశువు

హుకుంపేట: కేబుల్ కోసం తవ్విన గోతిలో పడి పశువు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. బారపల్లి పంచాయతీలో బీఎస్ఎన్ఎల్ టవర్ కేబుల్ నిర్మాణ పనుల్లో భాగంగా తవ్విన గోతిలో సోమవారం రెండు పశువులు పడిపోయాయి. స్థానికులు వాటిని కాపాడే ప్రయత్నం చేశారు. అప్పటికే ఒక పశువును కష్టపడి బయటకు తీయగా, మరో పశువు ఊపిరాడక మృతి చెందింది.

జగనన్న సురక్షతో సత్వర సేవలు

ఆర్డీవో హెచ్.వి. జయరాం



నర్సీపట్నం: సర్టిఫికెట్లు అందజేస్తున్న ఆర్డీవో జయరాం, ఎంపీపీ సుర్ల రాజేశ్వరి

నర్సీపట్నం: ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఆర్డీవో హెచ్.వి.జయరాం అన్నారు. వేములపూడి సచివాలయం-1లో సోమవారం ఆయన జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడారు. 11 రకాల సర్టిఫికెట్లను ఎలాంటి రుసుం లేకుండా లబ్ధిదారులకు అందిస్తున్నామన్నారు. వీటితోపాటు ఏ ఇతర సమస్యలున్నా, అధికారుల దృష్టికి తీసుకువచ్చినట్లయితే వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. ఎంపీపీ సుర్ల రాజేశ్వరి మాట్లాడుతూ ఏ సర్టిఫికెట్ కావాల్సిన గతంలో కార్యాలయాలు చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. అనంతరం వివిధ రకాల సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందజేసారు. ఎంపీటీసీ బోళం వెంకటేష్, పార్టీ సీనియర్ నాయకుడు బోళం నర్సింహామూర్తి, నాయకుడు గుడివాడ లోవరాజు, పీఏసీఎస్ అధ్యక్షులు మురళి మండల సచివాలయ కన్వీనర్ శానపతి వెంకటరత్నం, సర్పంచ్ నూకాలమ్మ, ఎంపీడీవో జయమాధవి, తహసీల్దార్ అన్నాజీరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదోడికి మేలైన సంస్కరణలు

కె.కోటపాడు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతీ పేదోడికి మేలైన సంస్కరణలను రూపొందించారని ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ అన్నారు. పిండ్రంగి, మేడిచర్ల గ్రామాల్లో సోమవారం జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉండి సంక్షేమ లబ్ధిని పొందని వారి కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిండ్రంగిలో 358, మేడిచర్లలో 267 మందికి ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. పిండ్రంగి సచివాలయ సిబ్బందిని లంకవానిపాలెం సర్పంచ్ వేచలపు దొరబాబు దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. మండల సచివాలయ కన్వీనర్ ఏటుకూరి రాజేష్, సర్పంచ్ జాగరపు వెంకట రామలక్ష్మి, మాజీ సర్పంచ్ అవుగడ్డ సొంబాబు, ఎంపీటీసీ నెక్కల గోపి, మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి, ఎంపీడీవో శచీదేవి, తహసీల్దార్ జె.రమేష్‌బాబు, ఈవోపీఆర్డీ ప్రసాద్, డీటీ రమేష్ పాల్గొన్నారు.

జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలకు ఎంతో మేలు

గొలుగొండ: జగనన్న సురక్షతో పేదలకు ఎంతో మేలు కలుగుతుందని జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి తెలిపారు. చీడిగుమ్మల-2, కొత్తమల్లంపేట గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. సుమారుగా 690 మంది లబ్ధిదారులకు సర్టిఫికెట్లు మంజూరు చేశారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, సర్పంచ్ పోలిరెడ్డి రాజుబాబు, ఎంపీటీసీ లెక్కల అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ సుర్ల బాబ్జి, తహసీల్దార్ ఆనందరావు, ఎంపీడీవో డేవిడ్‌రాజు పాల్గొన్నారు.



మాడుగుల రూరల్: ఎం. కోటపాడులో ధ్రువపత్రాలు అందజేస్తున్న తహసీల్దారు పి.వి.రత్నం

ఏ ఒక్కరూ సంక్షేమానికి దూరం కాకూడదు

దేవరాపల్లి: అర్హత ఉండి ఏ ఒక్కరూ సంక్షేమ పథకాలకు దూరం కాకూడదనే సంకల్పంతోనే సీఎం జగన్ జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి తెలిపారు. సోమవారం రైవాడలో 201 మందికి సర్పంచ్ చల్లా లక్ష్మి, వైస్ ఎంపీపీ ఉగ్రాకుల గంగాభవానీ, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. చింతలపూడిలో సర్పంచ్ దొమ్మంగి బోడెమ్మ, తామరబ్బ సర్పంచ్ టోకురి రామకృష్ణ, ఎంపీటీసీ బండి గౌరమ్మ సమక్షంలో 290 మందికి వారు ధ్రువపత్రాలను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ ఎం. లక్ష్మి, మాజీ సర్పంచ్ చల్లా తాతయ్యలు, ఉగ్రాకుల అప్పారావు, చల్లా నాయుడు, ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ జి. సంతోషి నళిని పాల్గొన్నారు.

811 అర్జీలు పరిష్కారం

చోడవరం: ప్రభుత్వ సేవలు మరింత చేరువ చేసేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టినట్టు సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి నాగులపల్లి రాంబాబు తెలిపారు. అంకుపాలెం సభలో 408 అర్జీలు పరిష్కరించారు. అంబేరుపురం సచివాలయం సభలో 403 అర్జీలను పరిష్కరించారు. రాంబాబు మాట్లాడుతూ ఒక్క రోజులోనే 11 రకాల సేవలకు సంబంధించిన సర్టిఫికెట్లు ప్రజలకు అందిస్తున్నది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అన్నారు. తహసీల్దార్ తిరుమలరావు, ఎంపీడీవో చైతన్య, ఎంపీపీ గాడి కాసు, బెన్నవోలు సర్పంచ్ మూడెడ్ల శంకరావు, మండల పరిషత్ సూపరింటెండెంట్ అమ్మాజి, ఆర్‌ఐ గిరి పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: ఎం. కోటపాడు గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారుల ఇంటి ముంగిటకే అన్ని సర్టిఫికెట్లు అందిస్తున్నామని ఎం. కోటపాడు, ఎం.కె.వల్లాపురం ఉప సర్పంచ్‌లు శానాపతి గంగాధర్, కరణం రాము తెలిపారు. తహసీల్దారు పి.వి.రత్నంతో కలిసి 950 మందికి వివిధ రకాల ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి తిరుమలాదేవి, వీఆర్వో శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



దేవరాపల్లి: చింతలపూడిలో ధ్రువపత్రాలు అందజేస్తున్న బూరె బాబూరావు, కన్వీనర్ రమణ



అంకుపాలెంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



కె.కోటపాడు: పిండ్రంగిలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందిస్తున్న ఎంపీపీ, సర్పంచ్‌లు



దేవరాపల్లి: రైవాడలో ధ్రువపత్రాలు అందిస్తున్న ఎంపీపీ రాజేశ్వరి

నేడు తూటిపాలలో జగనన్న సురక్ష

మాకవరపాలెం: తూటిపాలలో మంగళవారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో అరుణశ్రీ సోమవారం తెలిపారు. ఇప్పటివరకు 14 గ్రామ సచివాలయల పరిధిలో జరిగిన సురక్ష శిబిరాల్లో 5,176 ధ్రువపత్రాలను పంపిణీ చేశామన్నారు.

వర్షాన్ని లెక్క చెయ్యకుండా 'గడప గడపకు'..

- సంక్షేమ లబ్ధిని వివరించిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



జె.డి.పేటలో మహిళలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల రూరల్: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం జె.డి.పేట శివారు లోవ గవరవరం, కొండలపాడు గిరిజన గ్రామాల్లో వర్షాన్ని సైతం లెక్క చెయ్యకుండా అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఇంటింటికీ తిరిగారు. నాలుగేళ్లలో చేకూరిన సంక్షేమ లబ్ధిని ప్రజలకు వివరించి బుక్‌లెట్ అందించారు. ఆయా గ్రామాల గిరిజనులతో మాట్లాడారు. జలజీవన్ మిషన్ పథకంలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్‌కు జె.డి.పేటకు రూ.కోటి, గవరవరం గ్రామానికి రూ.30 లక్షలు, కొండలపాడుకు రూ.25 లక్షల మంజూరు చేశామన్నారు. నాడు - నేడులో భాగంగా స్థానిక ఎంపీయూపీ పాఠశాలలో రూ 21.73 లక్షలతో పనులు ప్రారంభించారు. జగనన్న ఇళ్ల పథకంలో భాగంగా 105 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి చిన్నారులతో ముచ్చటించారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించి ఆశీర్వదించారు. ప్రాధాన్యత ప్రకారం అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తామన్నారు. ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, జెడ్పీటీసీ సభ్యురాలు కిముడు రమణమ్మ, సర్పంచ్ కోశిరెడ్డి కృష్ణమూర్తి, మాడుగుల సర్పంచ్ యడ్ల కళావతి, శంకరం సర్పంచ్ శోలం రమేష్, మండల సచివాలయాల కన్వీనర్ బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, నాయకులు శ్రీనాథు శ్రీనివాసరావు, పడాల అప్పలనాయుడు, గొల్లవిల్లి రాజేశ్, కోరుకొండ చెల్లంనాయుడు, సయ్యపురెడ్డి నారాయణరావు, దొండా నాగమణి, అల్లంగి సంజీవ్, శీరా తలుపులునాయుడు, కల్యాణరాజు, పల్లె రామునాయడు, బన్నీ, ఎంపీడీవో మీనాకుమారి, ఆర్‌ఐ నాగేశ్వరరావు, ఏఈలు లెక్కల సత్యనారాయణ, నర్సింగరావు, భార్గవ్‌కుమార్, రాంబాబు, ఐసీడీఎస్ సీడీపీవో శ్రీదేవి, మంత్రి ఓఎస్‌డీ ఎం. పోలినాయుడు పాల్గొన్నారు.

అభిమాన ఉపాధ్యాయుడి 60 ఏళ్ల పండగ



ఉపాధ్యాయ దంపతులను పూలమాలలతో దీవిస్తున్న జెడ్పీటీసీ లక్ష్మీరమణమ్మ, ఉపాధ్యాయులు

రోలుగుంట: పెళ్లి సాధారణంగా జరగాలి. షష్టిపూర్తి ఘనంగా జరగాలన్నది నానుడి. పిల్లలు తమ కృతజ్ఞతను తల్లిదండ్రులకు అర్పించుకునే అపురూప ఘట్టం ఇది. అటువంటి మధురమైన రోజున ఉపాధ్యాయుడు ఆర్వీఎస్ఆర్ శర్మ వృత్తి పట్ల అంకిత భావం చూపిస్తూ యధావిధిగా విధులకు హాజరయ్యారు. ఈ క్రమంలో ఆయనకు అరవై ఏళ్లు నిండిన విషయం తెలుసుకున్న సహచర ఉపాధ్యాయులు మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఘన సన్మానం చేసి ఆశ్చర్యపరిచారు. శర్మ దంపతులకు బహుమతులు, పుష్పగుచ్ఛాలతో ఆనందాన్ని నింపారు. ఎంతో సంప్రదాయ బద్ధంగా నిర్వహించిన ఈ వేడుకకు జెడ్పీటీసీ పోతల లక్ష్మీరమణమ్మ హాజరై ఆశీర్వదించారు. అనంతరం అంతా సహపంక్తి భోజనం చేసి ఆనందం పంచుకున్నారు. ఈ వేడుకకు సోమవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల వేదిక అయింది. శర్మ భార్య విశాలక్షి కూడా ఉపాధ్యాయిని కావడంతో విధులకు హాజరయ్యారు. విధి నిర్వహణలో వీరి నిబద్ధతను హెచ్ఎం ప్రసాద్, తదితరులు ప్రశంసించారు.

కారంచేడు మృతులకు నివాళి



మాట్లాడుతున్న దళిత సంఘ నాయకుడు చిట్ల చలపతిరావు

నర్సీపట్నం: కారంచేడు మృతులకు దళిత సంఘాల నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో దళిత సంఘం నాయకుడు చిట్ల చలపతిరావు మాట్లాడుతూ కారంచేడులో మృతి చెందిన వారి పోరాటం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. 29 ఏళ్ల క్రితం నాటి ఈ గాయం నేటికీ బాధిస్తుందన్నారు. దళిత, ఆదివాసీలపై దాడులు, దౌర్జన్యాలను అరికట్టేందుకు ప్రభుత్వాలు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. రాజ్యాంగం కల్పించిన సమాన హక్కును అగ్రకులాలు కాలరాస్తున్నాయన్నారు. సమాజంలో దళితుల ఉనికిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఏఐఎం డివిజన్ కార్యదర్శి కె.మల్లేశ్వరరావు, ఏపీ ఆదివాసీ హక్కుల సాధన సంఘం అధ్యక్షుడు ఎన్.కల్యాణ్ పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



బదిలీ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న జెడ్పీటీసీ లక్ష్మీరమణమ్మ

రోలుగుంట: పది తరగతి ఫలితాల మాదిరిగానే ఎన్ఎంఎంఎస్ టాలెంటు టెస్టుల్లో సాధించడానికి ఉపాధ్యాయులు దృష్టి సారించాలని జెడ్పీటీసీ సభ్యురాలు పోతల లక్ష్మీరమణమ్మ తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులకు, పూర్వ హెచ్ఎంలకు ప్రస్తుత హెచ్ఎం ప్రసాద్ సోమవారం సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్ఎం ఈరెల్లి అప్పారావు, ఉపాధ్యాయులు దారబాబు, ఎస్.సత్తిబాబు, డి.నానాజీ, పదవీ విరమణ హెచ్ఎంలు ఎస్. సాల్మాన్‌రాజు, కమలాదేవిని దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు ఆర్.వి.ఎస్.ఆర్ శర్మ, నాని, కిరణ, రామశేషు, సతీష్ రమాకుమారి, శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

ఆర్డీవో స్పందనకు 17 అర్జీలు



ఆర్డీవో కారాయలయం వద్ద వంటావార్పుతో నిరసన తెలుపుతున్న సాగుదారులు

నర్సీపట్నం: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమానికి 17 అర్జీలు వచ్చాయి. ఏవో సూర్యనారాయణ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఎక్కువగా రెవెన్యూ పరమైన సమస్యలపై ఫిర్యాదులందాయి. అదేవిధంగా రెవెన్యూ అధికారుల తీరుపై రోలుగుంట మండలం రత్నంపేట పంచాయతీ పనసలపాడు గిరిజనులు ఇక్కడ కార్యాలయం వద్ద వంటావార్పు చేపట్టారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఇ.చిరంజీవి మాట్లాడుతూ రీసర్వేలో స్థానికేతరులైన రియల్ ఎస్టేట్ వ్యాపారులు సాగు చేసినట్టుగా ఆర్వోఆర్ రికార్డుల్లో నమోదు చేశారన్నారు. దాంతో సాగుదారులైన దళిత, గిరిజనులకు అన్యాయం చేస్తున్న రోలుగుంట తహసీల్దార్‌పై జేసీ విచారణ చేపట్టి న్యాయం చేయాలన్నారు. సర్వే నంబరు 2, 3, 4, 6, 7, 8, 11లో 25 ఎకరాలపై తక్షణమే సమగ్ర దర్యాప్తు చేయాలన్నారు. మాజీ ఎంపీటీసీ దుర్గబాబు, దళిత సంఘాల నాయకులు ఎ.చిలుకు, గేమిలి చిన్నబ్బాయి, సాగుదారులు పాల్గొన్నారు.

జిరాయితీగా గుర్తించాలని ఫిర్యాదు

రావికమతం: తమ సాగు భూములను గతంలో జిరాయితీగా పేర్కొన్న అధికారులు ప్రస్తుతం ప్రభుత్వానివిగా గుర్తించారని మరుపాక గ్రామానికి చెందిన రైతులు మచ్చా హనుమంతు, సారిపల్లి శ్రీనివాసరావు వాపోయారు. ఈ మేరకు నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయంలో ఏవోకు సోమవారం ఫిర్యాదు చేశారు. గర్నికంలో సర్వే నంబరు 81-1బిలో 2.47 ఎకరాల భూమిని తమ పెద్దల నుంచి సాగు చేసుకుంటున్నామని, రీసర్వేలో సర్వే నంబరు 81-3గా పేర్కొంటూ నోటీసులు ఇచ్చారని, దీనిపై తగు విచారణ చేసి న్యాయం చేయాలంటూ కోరారు.

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం

నాతవరం: స్థానిక మాజీ సర్పంచ్ కామిరెడ్డి కిత్తయ్య నాయుడు(70) మృతికి పలువురు సంతాపం తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. 1995లో సర్పంచ్‌గా, తరువాత కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడిగా పని చేశాడు. మాజీ ఎంపీపీ పి.కొండబాబు, సాగి లక్ష్మణ, కాపారపు అప్పలనాయుడు, నేతల విజయ కుమార్, వస్త్ర సంఘం కమిటీ సంతాపం ప్రకటించారు.

పూడిక తీత పనులు ప్రారంభం

మాకవరపాలెం: డ్రైనేజీల్లో పూడిక తీత పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. తామరంలోని వీధి కాలువల్లో పూడిక పేరుకుపోవడంతో పంచాయతీ అధికారులు తొలగింపు పనులను సోమవారం చేపట్టారు. వారం రోజులపాటు ఈ పనులు కొనసాగుతాయని సర్పంచ్ గొంతిన చెల్లారత్నం, కార్యదర్శి బాలదొర తెలిపారు.

ఉత్తమ ఫలితాల కోసం మేలైన బోధన



ఎంఈవో-2 జగ్గారావు

రోలుగుంట: మేలైన బోధనతోపాటు పదిలో ఉత్తమ ఫలితాలు సాధన కోసం ఈ నెల నుంచే అవసరమైన చర్యలు తీసుకోనున్నామని ఎంఈవో-2 పి.జగ్గారావు సోమవారం తెలిపారు. మండల స్థాయిలో యూడైస్ శతశాతం పూర్తి చేశామన్నారు. బయోమెట్రిక్ 97 శాతం అయిందన్నారు. పాఠశాలలను సందర్శించి గుర్తించిన లోపాలు సరిచేస్తున్నామన్నారు. ప్రతి పాఠశాలలో సమయపాలనతోపాటు విద్యార్థులకు మేలైన బోధన, మెనూ సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రధానంగా పది ఫలితాల సాధన కోసం అదనపు తరగతుల నిర్వహణ ఈ నెల నుంచే అమలు చేయనున్నామన్నారు. తొమ్మిదో తరగతి నుంచే విద్యా బోధన మెరుగుకు చర్యలు తీసుకోనున్నట్టు వివరించారు.

పక్కాగా ఓటరు జాబితా సవరణలు



బీఎల్వోలతో మాట్లాడుతున్న ఆర్డీవో చిన్నికృష్ణ

అనకాపల్లిటౌన్: ఓటర్ల జాబితాను పక్కాగా తయారుచేయడంలో ప్రతి ఒక్కరూ ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని ఆర్డీవో ఏజే చిన్నికృష్ణ తెలిపారు. స్థానిక గాంధీనగరం జీవీఎంసీ కల్యాణమండపంలో సోమవారం బీఎల్వోల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. వివిధ ప్రాంతాల్లో నివసించే వ్యక్తుల పేర్లు, మరణించిన వ్యక్తులు, చిరునామా మార్పులు, చేర్పులు వంటివి ప్రతి ఇంటికి వెళ్లి, పరిశీలించి పక్కాగా రూపొందించాలన్నారు. ఆగస్టు 21లోపు ఓటరు జాబితాను సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, బీఎల్వోలు పాల్గొన్నారు.

బైక్ దొంగలపై చర్యలు తీసుకోండి



ఎస్‌ఐ సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నేతలు

అనకాపల్లిటౌన్: మోటార్ బైక్ దొంగతనాలకు అడ్డుకట్టు వేయాలని, డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడుపుతున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు స్థానిక పట్టణ ఎస్‌ఐ ఎస్.సత్యనారాయణకు సోమవారం వినతిపత్రం అందించారు. రికార్డులు లేకుండా కొంత మంది వ్యక్తులు బైక్‌లు కొనుగోలు చేయడం జరుగుతుందని, పాత వాహనాల కొనుగోలు దుకాణాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ బొట్టా చిన్నియాదవ్, ఆళ్ల ప్రవీణ్‌కుమార్, బండి అప్పారావు, వాసుపల్లి తాతయ్యలు తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుతో అదనపు ఆదాయం



డ్వాక్రా మహిళలకు మొక్కలను అందిస్తున్న ఎంపీపీ జగన్‌మోహన్



మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రాజు, తదితరులు



మాకవరపాలెం: మొక్కలు నాటుతున్న హరిబాబు, తదితరులు

కె.కోటపాడు: డ్వాక్రా మహిళలు పండ్ల మొక్కలను సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందవచ్చని ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ అన్నారు. వెలుగు ఆధ్వర్యంలో సోమవారం కె.కోటపాడులో గ్రీన్ మిలీనియంలో భాగంగా డ్వాక్రా మహిళలకు మొక్కలను ఆయన పంపిణీ చేశారు. మండలంలో 1,400 డ్వాక్రా సంఘాలకు మూడు రకాల పండ్ల మొక్కలను తక్కువ ధరకే పంపిణీ చేస్తున్నట్టు ఏపీఎం వెంకటలక్ష్మి తెలిపారు. 4,936 కొబ్బరి, మామిడి, సపోట, చింత, నిమ్మ, నారింజ, జామ మొక్కలను పంపిణీ చేస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గొర్రుపోటు వెంకటరావు, ఏటుకూరి రాజేష్, సీసీలు వెంకటరావు, సూర్యనారాయణ, సీతంనాయుడు, సింహాచలంనాయుడు, సన్యాసిరావు పాల్గొన్నారు.

రావికమతం: గ్రీన్ మిలీనియం ప్రోగ్రాంలో భాగంగా సోమవారం రావికమతంలో డ్వాక్రా సంఘాల సభ్యులకు ఎంపీపీ పైల రాజు పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. పండ్ల తోటల అభివృద్ధికి, తద్వారా డ్వాక్రా సభ్యులకు ఆదాయం పెంచే కార్యక్రమంలో భాగంగా మామిడి, సపోటా, స్వీట్ ఆరెంజ్, జామ, నిమ్మ, తదితర 5,402 మొక్కలు కడియం నుంచి తెప్పించి పంపిణీ చేశామని ఏపీడీ తిలక్ తెలిపారు.

సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలి

దేవరాపల్లి: మానవాళి మనుగడకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు, బోయిలకింతాడ సర్పంచ్ బూరె బాబూరావు తెలిపారు. గ్రీన్ మిలీనియం ప్రోగ్రాంలో భాగంగా వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో బోయిలకింతాడలో ఆయన స్వయం సహాయక సంఘ సభ్యులకు మొక్కలు పంపిణీ చేశారు. వీటిని నాటడంతోపాటు పరిరక్షించాలని కోరారు. వీవోఏ జాజిమొగ్గల చినమ్మలు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడాలి

మాకవరపాలెం: పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని తూర్పుకాపు సంఘ మండలాధ్యక్షుడు గొంతిన హరిబాబు అన్నారు. గ్రీన్ మిలీనియం కార్యక్రమంలో భాగంగా తామరం శ్మశానవాటిక వద్ద సోమవారం ఆయన మొక్కలు నాటారు. వీటిని శ్రద్ధగా సంరక్షించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి బాలదొర, ఉప సర్పంచ్ ప్రసాద్, వలంటీర్లు పాల్గొన్నారు.

లాభదాయకంగా అంతర పంటలు



కొత్తవలసలో పామాయిల్‌లో అరటి తోటల సాగు

మాడుగుల: మండల రైతులు పామాయిల్ సాగులో అంతర పంటల పెంపకంపై దృష్టి సారించారు. మెట్ట ప్రాంతాల్లో ప్రస్తుతం పామాయిల్ సాగు ఉంది. ప్రధానంగా మండలంలో శంకరం, తాటిపర్తి, పంచాయతీల్లో 50 ఎకరాల్లోని పామాయిల్ సాగులో ఈ విధంగా అరటి తోటలు పెంచుతున్నారు. మూడేళ్లలో పామాయిల్ పక్వానికి చేరుకుంటుంది. ఈ లోగా ఎకరాకు రూ.50 వేలు అరటి తోటలు వల్ల లాభం వస్తుందని రైతులు చెబుతున్నారు.